క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల సర్వే త్వరగా పూర్తి చేయాలి



కార్యదర్శితో మాట్లాడుతున్న డీపీవో

తాండూర్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సాధ్యమైనంతవరకు సత్వరంగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) డి.వెంకటేశ్వరరావు అన్నారు. తాండూర్ గ్రామ పంచాయతీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంటి పన్నుల వసూలుకు చర్యలు తీసుకోవాలన్నారు. వందశాతం వసూలయ్యేలా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శి దివాకర్‌కు సూచనలు చేశారు. డీపీవో వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అనిల్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

గుడిసెల తొలగింపు



గుడిసెలు వేసుకున్న వారితో మాట్లాడుతున్న అటవీ అధికారులు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని తాళ్లపేట రేంజ్ తపాలాపూర్ గ్రామ సమీపంలో గల అటవీ భూమిలో కొంతమంది వ్యక్తులు అక్రమంగా గుడిసెలు వేసుకున్నారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు మంగళవారం ఘటనా స్థలానికి చేరుకొని అక్రమంగా వేసుకున్న గుడిసెలను తొలగించారు. గుడిసెల తొలగించే సమయంలో స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. అటవీ భూముల్లో గుడిసెలు వేస్తే చర్యలు తప్పవని తాళ్లపేట ఎఫ్ఆర్వో సుష్మారావ్ తెలిపారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న సంజీవరెడ్డి, బ్యాంక్ సిబ్బంది

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల పట్టణంలోని యూనివర్సల్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో యూనివర్సల్ బ్యాంకు 2025 నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను జిల్లా సహకార శాఖ అధికారి బి.సంజీవ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంజీవ రెడ్డి మాట్లాడుతూ.. బ్యాంకు ఖాతాదారులకు మంచి సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందుతుందన్నారు. బ్యాంక్ టర్నోవర్ రూ.98కోట్లు ఉందని, ప్రజలు బ్యాంకు సేవలు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ వినయ్‌కుమార్, సీఈవో కేవీఎస్ఎన్ మూర్తి, డైరెక్టర్లు రాజలింగు, జే. శ్రీదేవి, ఐవీఎస్ఎస్ ఆదిత్య, సిబ్బంది పాల్గొన్నారు.


3న కొలాంగూడలో ఆలయ వార్షికోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆదివాసీలు

కాసిపేట: మండలంలోని పెద్దపూర్ కొలాంగూడలో ఈ నెల 3న నిర్వహించే లోవ భీమయ్యక్ ఆలయం వార్షికోత్సవం పోస్టర్లను మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు, ఆదివాసీలు ఆవిష్కరించారు. ఏటా ఆదివాసీలు ఘనంగా నిర్వహించే భీమయ్యక్ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేల మంది భక్తులు తరలివస్తారు. మూడురోజుల పాటు నిర్వహించే జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు ఆత్రం మహేష్, అధ్యక్షుడు ఆత్రం భీంరావు, ఉపాధ్యక్షుడు ఆత్రం గంగారాం, భీము, ప్రధానకార్యదర్శి భీంరావు తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



మేదరిపేటలో తనిఖీ నిర్వహిస్తున్న సీఐ, ఎస్సై

లక్సెట్టిపేట/దండేపల్లి: డిసెంబర్ 31వ తేదీ సందర్భంగా మంగళవారం రాత్రి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. దండేపల్లి మండలం మేదరిపేటలో, లక్సెట్టిపేటలో సీఐ నరేందర్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. కార్యక్రమాల్లో లక్సెట్టిపేట ఎస్సై సతీష్, దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పిక్నిక్ స్పాట్ కరువు..!

- సెలవురోజుల్లో కార్మిక కుటుంబాలకు ఆటవిడుపు దూరం
- గతంలో పిక్నిక్ స్పాట్‌గా సీతారాంపల్లి ఇంటెక్‌వెల్
- భద్రత కారణాల దృష్ట్యా నిషేధిత ప్రాంతంగా గుర్తింపు
- కొత్తది ఏర్పాటు చేయాలని డిమాండ్



సీతారాంపల్లి సింగరేణి ఇంటెక్‌వెల్ ప్రాంతం

శ్రీరాంపూర్: సింగరేణిలో అతిపెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్ ఏరియాలో కార్మిక కుటుంబాలకు ఆటవిడుపు కరువైంది. నిత్యం గనుల్లో చెమటోడ్చి పనిచేసే కార్మికులకు ఆదివారం సెలవు రోజు భార్య పిల్లలతో సరదగా బయటికి వెళ్లి సంతోషంగా గడపడానికి పిక్నిక్ స్పాట్ కరువైంది. పండుగ సెలవుల్లో కుటుంబ సభ్యులతో గాని, బంధువులు వస్తే వారితో బయటికి వెళ్లి అక్కడే భోజనాలు వండుకొని, ఆటపాటలతో గడపాలని చాలామంది కోరుకుంటారు. అవేవి సింగరేణిలో తీరడం లేదు. రూ.కోట్ల లాభాలు గడిస్తున్న సంస్థ కార్మికుల సంక్షేమంలో భాగంగా పిక్నిక్ స్పాట్లు ఏర్పాటు చేయాలని పలువురు కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కనీసం ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటే మంచి పిక్నిక్ స్పాట్‌ను శ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. గనుల చుట్టూ వేలాది ఎకరాల కంపెనీ భూములు ఉన్నాయి. కొంత నిరుపయోగంగా ఉండగా మరికొన్ని ఎకరాల్లో ప్లాంటేషన్ చేశారు. వాటిల్లోనైనా మధ్యలో పిక్నిక్ స్పాట్ ఏర్పాటు చేసుకునే వీలుంది. కొంత ఏరియా ఫెన్సింగ్ లేదా ప్రహరీ నిర్మించి అందులో పార్కు తయారు చేసి పిల్లల కోసం ఆట వస్తువులు, వంటలు చేసుకునే ఏర్పాట్లు, నీటి సాకర్యం కల్పిస్తే పిక్నిక్ స్పాట్‌గా మారనుంది. ఎక్కడో సింగరేణికి సంబంధం లేదని ప్రాంతాల్లో సీఎస్ఆర్ నిధులను ధారాదత్తం చేస్తున్న సంస్థ.. ఉద్యోగుల కుటుంబాల సంక్షేమం కోసం ఈమాత్రం ఏర్పాటు చేయడానికి వెనుకాడటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఇంటెక్‌వెల్‌లో అనుమతి నిరాకరణ

సీతారాంపల్లి గోదావరి ఒడ్డున ఉన్న సింగరేణి ఇంటెక్‌వెల్ చాలా ఏళ్లుగా పిక్నిక్ స్పాట్‌గా విరజిల్లింది. కాలనీలకు తాగునీటిని అందించేందుకు 1977లో ఇంటెక్‌వెల్ ఏర్పాటు చేసి అప్పటి నుంచి నీరందిస్తున్నారు. చుట్టూ పచ్చనిచెట్లు, మధ్యలో చిన్న పార్కు ఉంది. కంపెనీ అధికారికంగా పిక్నిక్ స్పాట్‌గా ప్రకటించకున్నా కూడా 32 ఏళ్ల దాకా పిక్నిక్ స్పాట్‌గా కార్మిక కుటుంబాలు వినియోగించుకున్నాయి. ఆదివారం వస్తే కార్మిక కుటుంబాలు, పాఠశాలల పిల్లలతో కళకళలాడేది. ఒక పక్క గోదావరి నది, మరో పక్క పచ్చని పొలాలతో వాతావరణం ఆహ్లాదంగా ఉండేది. కాని 15 ఏళ్ల క్రితం నుంచి ఎవరిని అనుమతించడం లేదు. నిషేధిత ప్రాంతంగా బోర్డు పెట్టి ఇంటెక్‌వెల్‌లో పనిచేసే వారిని తప్ప ఎవరిని లోపలికి అనుమతించడం లేదు.

ఏర్పాటు చేయాలి



శ్రీరాంపూర్ ఏరియాలో కార్మిక కుటుంబాల ఆటవిడుపు కోసం పిక్నిక్ స్పాట్‌ను ఏర్పాటు చేయాలి. గతంలో ఉన్న ఇంటెక్‌వెల్‌లోకి ఎవరికి అనుమతించడం లేదు. శ్రీరాంపూర్ ఓసీపీకి వెళ్లేదారిలో ఉన్న ప్లాంటేషన్‌లో పిక్నిక్ స్పాట్ ఏర్పాటుకు త్వరలోనే యాజమాన్యాన్ని కలిసి కోరుతాం.

- కె.వీరభద్రయ్య, గుర్తింపు సంఘం డెప్యూటీ ప్రధాన కార్యదర్శి

పదోన్నతితో పోలీస్ ప్రతిష్టను పెంపొందించాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



పదోన్నతి పొందిన పోలీస్ అధికారులతో సీపీ

మంచిర్యాలక్రైం: పోలీస్ శాఖలో పదోన్నతులు పొందిన అధికారులు తమ పదోన్నతితో పోలీస్ ప్రతిష్టను పెంపొందించాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. కమిషనరేట్ పరిధిలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేసిన ముగ్గురికి ఏఎస్సైగా పదోన్నతి లభించినందుకు గాను వారికి మంగళవారం కమిషనరేట్ ఆవరణలో పదోన్నతి చిహ్నాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఉద్యోగంలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. పోలీస్‌శాఖలో కానిస్టేబుల్‌గా చేరి ఉన్నతాధికారుల మన్ననలు పొందుతూ పదోన్నతులు పొందడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం పదోన్నతులు పొందిన జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన గులాం ధస్తగిర్, కాసిపేటకు చెందిన ఇల్యాస్ ఖాన్, రామకృష్ణపూర్‌కు చెందిన డీ.పద్మనాభంకు ఏఎస్సై పదోన్నతి చిహ్నాలతో సత్కరించారు.

ఉద్యోగ విరమణ పొందిన వారికి అండగా ఉంటాం

మంచిర్యాలక్రైం: పోలీస్‌శాఖలో ఉద్యోగ విరమణ పొందిన వారికి అండగా ఉంటామని సీపీ శ్రీనివాస్ అన్నారు. కమిషనరేట్ పరిధిలోని పలువురు అధికారులు మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా కమిషనరేట్ ఆవరణలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎస్కే అక్బర్ పాష, ఏ.రాములు ఎస్సైలుగా, టీ.లక్ష్మణ్ ఏఆర్ ఎస్సైగా, షఫీ ఉల్లఖాన్, వీ, రవీందర్ ఏఎస్సైలుగా అంచెలంచెలుగా ఎదిగి 35సంవత్సరాల 8నెలలు విధులు నిర్వర్తిస్తూ ఉన్నతాధికారుల మన్ననలు పొందారన్నారు. పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వర్తించి పోలీస్‌శాఖకు, ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులతో శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని సూచించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను, వారి కుటుంబ సభ్యులను శాలువాలతో సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో అడిషనల్ డీసీపీ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సుందర్‌రావు, ఏవో శ్రీనివాస్, ఏఆర్ సీఐ దామోదర్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల పట్టణంలోని ఒడ్డెర కాలనీలోని పేద ప్రజలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. యువరాజ్యం స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో హాజీపూర్ మండలం ర్యాలీ గ్రామ పంచాయతీలో కొలాంగూడ గిరిజన తాండాలోని గిరిజనులకు తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే దుప్పట్లు పంపిణీ చేశారు.

ఆధారాలు లేని వార్తలు రాస్తే చర్యలు

- ఎమ్మెల్యే పీఏపై నిందారోపణలు చేసిన వ్యక్తిపై కేసు
- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

జైపూర్: ఆధారాలు లేని వార్తలు రాస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బేతు తిరుపతిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. జైపూర్ అసిస్టెంట్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎల్కంటి గ్రామానికి చెందిన బేతు తిరుపతిరెడ్డి అనే వ్యక్తి రెండు రోజుల క్రితం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పీఏ రమణరావుపై నిందారోపణలు చేస్తూ సోషల్ మీడియా వేదికగా పలు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఐటీ యాక్ట్ ప్రకారం కేసుమోదు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో నిందారోపణలు చేస్తూ గ్రూపుల్లో షేర్ చేస్తే గ్రూపు అడ్మిన్‌లపై, వైరల్ చేసిన వారిపై ఐటీ యాక్ట్ కేసుతో పాటు పరువు నష్టం కింద కేసు నమోదు అవుతుందని హెచ్చరించారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే అరెస్టు చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా వార్తలు రాసేటప్పుడు వివరణలు తీసుకోవాలని, ఆధారాలు లేకుండా వార్తలు రాస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇందులో స్థానిక ఎస్సై శ్రీధర్ ఉన్నారు.

'అవకతవకలకు పాల్పడుతున్న ఆర్‌పీ'



మాట్లాడుతున్న డ్వాక్రా సభ్యులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ 13వార్డు శ్రీ వీరహనుమాన్ ఎస్ఎల్ఎఫ్ గ్రూపు ఆర్‌పీ మారెళ్లి రజిత డ్వాక్రా సభ్యులకు తెలియకుండా అవతవకలకు, అక్రమాలకు పాల్పడుతోందని శ్రీ సాయిరాం గ్రూపు డ్వాక్రా సంఘం సభ్యులు ఆరోపించారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీ వీర హనుమాన్ ఎస్ఎల్ఎఫ్‌లో ఉన్న శ్రీ సాయిరాం గ్రూపు నుంచి రూ.75వేలు రుణం తీసుకోగా, ఇందుకు సంబంధించి ప్రతినెలా రూ.2,010 సభ్యులు చెల్లించాల్సి ఉండగా రూ.2,200 కడుతున్నామని, మరో లోన్ రూ.40వేలు తీసుకోగా ప్రతినెలా కిస్తీ రూ.1,910కి బదులు రూ.2వేలు కడుతున్నట్లు వివరించారు. నిర్దేశించిన ప్రకారం కాకుండా అదనంగా డబ్బులు ఎందుకు కట్టాల్సి వస్తోందని ఆర్‌పీని అడిగితే సమాధానం చెప్పకుండా దాట వేస్తోందని తెలిపారు. అప్పు డబ్బులు 24నెలల్లో ముట్టజెప్పాల్సి ఉండగా 26నెలలు కట్టినట్లు పేర్కొన్నారు. శ్రీసాయిరాం గ్రూపుకు లోన్లు, శ్రీనిధి లోన్లు రాకుండా ఆర్‌పీ రజిత నిలుపుదల చేసి ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపించారు. ఆ అక్రమాలను కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆ విషయం తెలుసుకొని తనపై ఎవరికి ఫిర్యాదు చేసినా ఏమీ కాదని, మీ సంగతి చూస్తానని బెదిరింపులకు పాల్పడుతోందని వివరించారు. సంబంధిత అధికారులు జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

■ బొగ్గుబాయి వార్తలు

సమస్యల పరిష్కారానికి కృషి



సీహెచ్‌పీలో మాట్లాడుతున్న సమ్మయ్య

శ్రీరాంపూర్: క్లరికల్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య తెలిపారు. ఎస్సార్పీ సీహెచ్‌పీ, ఆర్కే 5 గనుల క్లరికల్ సబ్ కమిటీ సమావేశాలు మంగళవారం ఆయా గనులపై వేరువేరుగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లర్కుల సమస్యలను యజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకొనే వీలుగా, యూనియన్ నుంచి ప్రత్యేక సబ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ద్వారా వారి సమస్యల పరిష్కారం సులువు అవుతుందన్నారు. క్లర్కులకు ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా క్లరికల్ సబ్ కమిటీ ఆర్కే 5 గని ఫిట్ సెక్రెటరీగా సుద్దుల సురేశ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీగా అపర్ణ, సీహెచ్‌పీ ఫిట్ సెక్రెటరీగా జిల్లాల రవి, అసిస్టెంట్ సెక్రెటరీగా కిరణ్‌లను నియమించారు. కార్యక్రమాల్లో యూనియ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి ఏరియాలో 82శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న ఏరియా జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో డిసెంబర్ మాసంలో 82శాతం బొగ్గు ఉత్పత్తి జరిగినట్లు ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం ఉత్పత్తికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. కేకే–5 గనిలో 19,391టన్నులు (114 శాతం), కాసిపేట గనిలో 11,952టన్నులు, కాసిపేట–2 గనిలో 9,946టన్నులు, శాంతిఖనిలో 4,431(44శాతం), కేకే–ఓసీలో 93,385(49శాతం), ఆర్కే ఓసీలో 1,07,805టన్నుల ఉత్పత్తి అంటే ఓవరాల్‌గా ఏరియాలో 82శాతం బొగ్గు ఉత్పత్తి జరిగినట్లు జీఎం తెలిపారు. ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు మూడు నెలల మాత్రమే గడువుందని ఉద్యోగులంతా సమష్టి కృషితో ఉత్పత్తి లక్ష్యసాధనకు సహకరించాలన్నారు. సమావేశంలో ఎస్వోటు జీఎం విజయ్‌ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏరియా రక్షణాధికారి రవీందర్, డీవైపీఎం ఆసీఫ్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం.. బొగ్గు ఉత్పత్తికి సహకరించండి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో గుర్తింపు కార్మిక సంఘం నాయకులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు పరిష్కరిస్తామని బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సహకరించాలని ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం గుర్తింపు కార్మిక సంఘం(ఏఐటీయూసీ) నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు.. కేకే–5 గని బ్యాంకు షెడ్ రూఫ్ రిపేర్, శాంతిఖని భవిష్యత్ ప్రణాళిక, కాసిపేట గనికి సంబంధించి సేఫ్టీ మెటీరియల్, ఏరియాలోని కాలనీల్లో క్వార్టర్‌ల సమస్యలతో పాటు పలు సమస్యలు జీఎం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం జీఎం మాట్లాడుతూ.. తమ పరిధిలోని సమస్యలు తప్పకుండా పరిష్కరిస్తామని, సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో గుర్తింపు కార్మిక సంఘం(ఏఐటీయూసీ) బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, రామకృష్ణాపూర్ బ్రాంచ్ కార్యదర్శి అక్బర్ అలీ, ఏరియా ఎస్వోటు జీఎం విజయ్‌ప్రసాద్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఎస్ఈ (ఐఈడీ) ఫణికుమార్, ఎస్ఈ(సివిల్) రాము పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ కార్మికులకు సన్మానం

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–1 ఇంక్‌లైన్ గనిపై మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన జక్కం ధర్మయ్య, అన్నమనేని సుధాకర్, పెరుగు లింగయ్య ముగ్గురు కార్మిక దంపతులను అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ భూశంకరయ్య మాట్లాడుతూ.. సింగరేణి సంస్థకు కార్మికులు చేసిన కృషి మరవలేనిదన్నారు. శేష జీవితం సుఖసంతోషాలతో గడపాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, రక్షణాధికారి నిఖిల్ అయ్యర్, ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, అండర్ మేనేజర్ సుమన్, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీషాన్, బన్న లక్ష్మణ్‌దాస్, వోడ్నాల రాజన్న, శ్రీనివాస్, రంజిత్ తదితరులు ఉన్నారు.



కార్మిక దంపతులను సన్మానిస్తున్న అధికారులు

12న బీసీ రాజ్యాధికార సమితి సమావేశం



ఐక్యత చాటుతున్న బీసీ నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఈ నెల 12న నిర్వహించే బీసీ రాజ్యాధికార సమితి జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంచాల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా బీసీ రాజ్యాధికార సమితి గ్రామస్థాయిలో బలోపేతం చేయడం, బీసీలు రాజకీయంగా ఎదగడానికి బీసీ రాజ్యాధికార సమితి ఎల్లప్పుడు తోడ్పాటునందిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలను అధిక మెజార్టీతో గెలిపించుకొని బీసీల సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వేముల మల్లేష్, రంగు రాజేశం, పిట్టల రవీందర్, నాగరాజు, బండి రాజలింగు, వడ్డేపల్లి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన న్యూ ఇయర్ సంబురం



మందమర్రిలో బేకరీ ఎదుట..



ఆల్ఫోర్స్ పాఠశాలలో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్/మందమర్రిరూరల్: ఆంగ్ల నూతన సంవత్సరం వేడుకలు జిల్లాలో అంబరాన్నంటాయి. 2024కు వీడ్కోలు చెప్పి.. 2025కు స్వాగతం పలికారు. మంగళవారం అర్ధరాత్రి వరకు సంబురాల్లో మునిగితేలారు. మందమర్రి మార్కెట్, పాత బస్టాండ్ ఏరియాల్లో బేకరీల ఎదుట ప్రత్యేక టెంట్లు ఏర్పాట్లు చేసి కేకుల బాక్స్‌లు అమ్మకానికి ఉంచారు. రంగుల అమ్మకాలు జోరుగా సాగాయి. మంచిర్యాల ఆల్ఫోర్స్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విద్యార్థుల హ్యాపీ న్యూ ఇయర్ ప్లేకార్డులు ప్రదర్శించారు.

సంక్షిప్త వార్తలు

ప్రభుత్వ భూములు కాపాడాలని వినతి

జన్నారం: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 374లో గల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమిస్తున్నారని, వారి నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ మంగళవారం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 374లోని ప్రభుత్వ భూమిని గతంలోనే కొందరు కబ్జా చేసుకోవడానికి ప్రయత్నించారని, ఈ విషయం అప్పుడే అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో తొలగించినట్లు తెలిపారు. తిరిగి ఇటీవల మరి కొందరు ప్రభుత్వ భూమిలో తవ్వకాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘ నాయకులు ముల్కల్ల ప్రభాకర్, హరీశ్, శ్రావణ్‌కుమార్, వెంకటేశ్, సతీశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

భీమిని: మెనూ ప్రకారం భోజనం పెట్టాలని తహసీల్దార్ భిక్షర్ణదాస్ అన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాలను మంగళవారం పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట కేజీబీవీ సిబ్బంది ఉన్నారు.

సివిల్ రైట్స్ డే

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో మంగళవారం జజ్జరవెల్లి, రాజారాం గ్రామాల్లో సివిల్‌రైట్స్ డే నిర్వహించారు. కులవివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించాలని అందరూ సోదరభావంతో మెలగాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు శ్రీజ, జాహిద్, పోలీసులు పాల్గొన్నారు.

జనారణ్యంలోకి చుక్కల దుప్పి



మల్లంపేటలో ఇంట్లో చొరబడిన చుక్కల దుప్పి

వేమనపల్లి: అడవిలో స్వేచ్ఛగా తిరిగే చుక్కల దుప్పి మేతకోసం దారి తప్పి మల్లంపేట ఊరిలోకి వచ్చింది. దానికి ఎలాంటి హాని జరగకుండా రక్షణగా నిలిచిన గ్రామస్తులు సురక్షితంగా అటవీ అధికారులకు అప్పగించి శభాష్ అనిపించుకున్నారు. మల్లంపేట సమీప అడవుల్లో నుంచి మంగళవారం మధ్యాహ్నం చుక్కల దుప్పి గ్రామంలోకి వచ్చింది. అక్కళ్ల మధుకర్ ఇంటి సమీపంలోని వరండాలోకి చొరబడింది. మధుకర్, శంకర్, శ్రీనివాసచారి, గట్టయ్య జింకను గమనించారు. అటవీ అధికారులకు సమాచారం ఇచ్చి చుక్కల దుప్పిపై కుక్కలు దాడికి పాల్పడకుండా రక్షణగా నిలిచారు. నిమిషాల వ్యవధిలో నీల్వాయి అటవీ రేంజర్ అప్పలకొండ, డీఆర్వో ప్రమోద్‌కుమార్, ఎఫ్‌బీవో మహిపాల్, బేస్ క్యాంపు సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. దుప్పి ఆరోగ్య పరిస్థితిని పరీక్షించారు. సమీప నీల్వాయి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి వదిలిపెట్టారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి దుప్పి ప్రాణాలను కాపాడిన గ్రామస్తులను అటవీ రేంజ్ అధికారి అప్పలకొండ అభినందించారు. వన్యజీవుల సంరక్షణకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

సన్మానం

భీమారం: నర్సింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన కాచం సురేష్‌ను, మండల ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన సురేష్‌ను ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు.